Title Code:T/TG/2024/0625/0392/884

# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 10

ఆదివారం, అక్టోబరు 26, 2025

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## విమానాన్ని ఢీకొట్టిన పక్షి.. ఎయిరిండియాకు తప్పిన పెను ప్రమాదం



ఢిల్లీ: నాగ్‌పూర్ నుంచి ఢిల్లీ వెళ్తున్న ఏఐ466 విమానానికి పెను ప్రమాదం తప్పింది. నాగ్‌పూర్‌లో టేకాఫ్ అయిన కొద్దిసేపటికే పక్షి విమానాన్ని ఢీకొట్టింది. ఇంజన్‌లో సౌండ్ రావడంతో గుర్తించిన పైలట్.. విమానాన్ని తిరిగి నాగ్‌పూర్‌కు మళ్లించారు. నాగ్‌పూర్‌లో సురక్షితంగా ల్యాండ్ చేసిన అనంతరం విమాన సర్వీసును అధికారులు రద్దు చేశారు. విమాన మరమ్మతులకు అధిక సమయం అవడంతో రద్దు చేసినట్లు వెల్లడించారు. మరో వైపు, హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయంలో ప్రతికూల వాతావరణం కారణంగా రెండు ఇండిగో విమానాలను దారి మళ్లించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు రావాల్సిన రెండు విమానాలు గన్నవరం విమానాశ్రయానికి మళ్లించారు. పశ్చిమ బెంగాల్, బెంగళూరు నుంచి హైదరాబాద్ రావాల్సిన ఇండిగో విమానాలు దారి మళ్లించినట్లు అధికారులు వెల్లడించారు.

# ఎవరూ రచ్చకెక్కొద్దు!

మంత్రులు, నేతల విభేదాలను అంతర్గతంగా పరిష్కరించుకోండి

సీఎం, డిప్యూటీ సీఎం, పీసీసీలకు సూచించిన కాంగ్రెస్ అధిష్టానం

స్థానిక సంస్థల ఎన్నికలు, రిజర్వేషన్ల అమలుపై చర్చలు

15 రోజుల్లోగా డీసీసీ అధ్యక్షుల నియామకం పూర్తికి నిర్ణయం

ప్రతి ఉమ్మడి జిల్లాలో కచ్చితంగా ఒక ఓసీ, ఒక బీసీ డీసీసీ అధ్యక్షుడు!

విధాన నిర్ణయాల్లో డీసీసీలకు మరింత స్వేచ్ఛ ఇవ్వాలని చర్చ



న్యూఢిల్లీ: గత కొన్ని రోజులుగా తెలంగాణ కాంగ్రెస్‌లో, ప్రభుత్వంలో జరుగుతున్న పరిణామాలపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అసంతృప్తి వ్యక్తం చేసినట్లు ఏఐసీసీ వర్గాల ద్వారా తెలిసింది. ముఖ్యంగా మంత్రుల స్థాయిలోనే విభేదాలు రచ్చ కెక్కడంపై పార్టీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి కేసీ వేణు గోపాల్ రాష్ట్ర నేతలకు క్లాస్ తీసుకున్నట్లు సమాచారం. పార్టీలో అంతర్గతంగా చర్చించాల్సిన అంశాలను బహిరంగ వేదికలు, మీడియా ముందు మాట్లాడటాన్ని కేసీ తప్పుపట్టినట్లు తెలిసింది. డీసీసీ అధ్యక్ష నియా మకాల అంశంపై చర్చించేందుకు శనివారం ఢిల్లీకి వచ్చిన తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌లు రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై కేసీ వేణుగోపాల్‌తో

(మిగతా 2వ పేజీలో)



## గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు ఎప్పుడు?

గల్ఫ్ బాధితులను ఆప్యాయంగా పలకరిస్తున్న హరీశ్‌రావు

ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రవాస తెలంగాణ వాసులకు ఇచ్చిన హామీల అమలేదీ?

జోర్డాన్ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న తెలంగాణ కార్మికులు

హైదరాబాద్: ఉపాధి కోసం విదేశాలకు వెళ్లిన కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. బతుకుదెరువు కోసం అప్పులు చేసి జోర్డాన్, ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన కార్మికులు ఏజెంట్ల చేతుల్లో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, ఉపాధి కోసం జోర్డాన్ వెళ్లి అక్కడే చిక్కుకు పోయిన 12 మంది వలస కార్మికులు హరీశ్‌రావు చొరవతో శనివారం తెల్లవారు జామున హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో వారు హరీశ్‌రావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జోర్డాన్‌లో అనేక కష్టాలు ఎదుర్కొన్న తమను ఆదుకుని,

(మిగతా 2వ పేజీలో)



## నా ఓటమి వెనుక కుట్ర ఉందో లేదో బీఆర్ఎస్ కార్యకర్తలు ఆలోచించాలి: కవిత

బీఆర్ఎస్‌కు దూరమయ్యాక కవిత కొత్త ప్రయాణం

నిజామాబాద్‌లో 'జాగృతి జనం బాట' కార్యక్రమం ప్రారంభం

కుట్ర చేసి తనను పార్టీ నుంచి బయటకు పంపారని ఆరోపణ

అమరవీరుల కుటుంబాలకు ఇంకా న్యాయం జరగలేదని వ్యాఖ్య

నిజామాబాద్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన రాజకీయ భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. బీఆర్ఎస్ పార్టీకి దూరమైన తర్వాత ప్రజల్లోకి వచ్చిన ఆమె, నేడు నిజామాబాద్ కేంద్రంగా 'జాగృతి జనం బాట' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తనను కుట్రపూరితంగా పార్టీ నుంచి బయటకు పంపారని, ఇప్పుడు తన దారి తాను వెతుక్కుంటున్నానని సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం నిజామాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో కవిత మాట్లాడుతూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. "గత 20 ఏళ్లుగా కేసీఆర్ నాయకత్వంలో, బీఆర్ఎస్ పార్టీ కోసం అంకితభావంతో పనిచేశాను. 27 ఏళ్ల వయసులోనే తెలంగాణ ఉద్యమంలోకి అడుగుపెట్టాను. ఎన్నో అవమానాలు ఎదురైనా ఓపికతో

(మిగతా 2వ పేజీలో)



## వీడిన కర్నూలు బస్సు ప్రమాదం మిస్టరీ..

### అసలు జరిగింది ఇదే..

కర్నూలు: కర్నూలు బస్సు ప్రమాదం మిస్టరీ వీడింది. దర్యాప్తులో పలు కీలక విషయాలను కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ వెల్లడించారు. బైక్ నడిపిన శివశంకర్ వెనుక కూర్చున్న వ్యక్తిని ఎర్రి స్వామి(నాని)గా గుర్తించారు. శివశంకర్, ఎర్రి స్వామి ఇద్దరూ లక్ష్మీపురం గ్రామం నుండి అర్ధరాత్రి తర్వాత సుమారు 2 గంటల సమయంలో తుగ్గలి దిశగా బయలుదేరారు. ఎర్రి స్వామిని వదిలి.. తిరిగి రావడం కోసం శివశంకర్ బయలుదేరినట్లు తెలిసింది. బైక్ (పల్సర్)పై ప్రయాణించిన వీరు కియా షోరూం సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద రాత్రి 2.24 గంటలకు రూ.300 పెట్రోల్ కొట్టించుకుని తిరిగి బయలుదేరారు. బయలుదేరిన కొద్ది సేపటికే చిన్న టేకూరు సమీపంలో బైక్ స్కిడ్ అవడంతో రోడ్డు కుడి వైపున ఉన్న డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బైక్ నడిపిన శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక కూర్చున్న ఎర్రిస్వామి స్వల్ప గాయాలతో తప్పించుకున్నాడు. ప్రమాద స్థలంలో శివశంకర్‌కు సాయం చేయడానికి ప్రయత్నించిన ఎర్రి స్వామి.. బైక్‌ను రోడ్డుపై నుంచి తీయబోయే సమయంలోనే బస్సు బైక్‌ను ఢీకొట్టి.. కొద్ది దూరం ఈడ్చుకెళ్లింది. బస్సు కింద మంటలు రావడంతో భయపడిన ఎర్రి స్వామి అక్కడి నుంచి తన స్వగ్రామమైన తుగ్గలికి వెళ్లిపోయాడు. ఈ ప్రమాదంపై ఉలిందకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తదుపరి విచారణ కొనసాగుతోందని ఎస్పీ తెలిపారు.

## తొలి దశలో 10-15 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్!

కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు




## రెండు రాష్ట్రాల్లో పార్టీని అధికారంలోకి తీసుకొస్తాం

బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్‌రావు

పార్టీ బలోపేతంపై ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్‌తో చర్చలు

తెలంగాణలోనూ త్వరలో డబుల్ ఇంజిన్ సర్కార్: మాధవ్





# ఆ రెండు చోట్లా ఉప ఎన్నికలు ఖాయం

జూబ్లీహిల్స్‌లో గెలుపు పక్కా.. మెజారిటీ కోసం శ్రమించండి

గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ నాయకులతో కేటీఆర్ భేటీ

హైదరాబాద్ : బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఖైరతాబాద్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యేలపై రాబోయే రోజుల్లో అనర్హత వేటు పడటం ఖాయమని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. ఆ రెండు నియోజకవర్గాల్లో కూడా ఉప ఎన్నికలు తప్పవని, అలాగే రాష్ట్రవ్యాప్తంగా పార్టీ మారిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు కచ్చితంగా వస్తాయని

(మిగతా 2వ పేజీలో)

# హైదరాబాద్‌లో కాల్పుల కలకలం

సెల్ ఫోన్ దొంగలపై కాల్పులు జరిపిన డీసీపీ చైతన్య

డీసీపీపై కత్తితో దాడికి యత్నించిన సెల్ ఫోన్ దొంగ

ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపిన డీసీపీ

దొంగలకు గాయాలు... ఆసుపత్రికి తరలింపు






హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో కాల్పుల కలకలం రేగింది. శనివారం సాయంత్రం చాదర్‌ఘాట్ ప్రాంతంలో ఇద్దరు సెల్ ఫోన్ దొంగలపై సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ సాయి చైతన్య స్వయంగా కాల్పులు జరిపారు. తనపై కత్తితో దాడికి యత్నించడంతో ఆయన ఆత్మరక్షణ కోసం కాల్పులు జరపాల్సి వచ్చింది. ఈ ఘటనలో ఇద్దరు దొంగలకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే, డీసీపీ సాయి చైతన్య శనివారం సాయంత్రం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సమావేశం ముగించుకుని తిరిగి తన కార్యాలయానికి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. చాదర్‌ఘాట్ విక్టరీ ప్లే గ్రౌండ్ సమీపంలో ఇద్దరు వ్యక్తులు ఒకరి నుంచి సెల్‌ఫోన్ లాక్కొని పారిపోవడాన్ని ఆయన గమనించారు. వెంటనే అప్రమత్తమైన డీసీపీ, తన గన్‌మెన్‌తో కలిసి వారిని

(మిగతా 2వ పేజీలో)

# ఎవరూ రచ్చకెక్కొద్దు!



చర్చించారు. ఈ సందర్భంగా ఇటీవల పలువురు రాష్ట్ర మంత్రులు, నేతల మధ్య పొడచూపిన విభేదాలపై ఆయన ప్రశ్నించినట్లు తెలిసింది. అయితే, వివాదాలను పరిష్కరించే దిశగా తీసుకున్న చర్యలను ఆయనకు రాష్ట్ర నేతలు వివరించారు. సమస్యలపై అంతర్గతంగా చర్చించుకోవా లని, రచ్చకెక్కవద్దని నేతలకు కేసీ ఈ సందర్భంగా సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీలకు 42% రిజర్వేషన్లపైనా చర్చ జరిగినట్లు తెలిసింది. బీసీ రిజర్వేషన్లపై నవంబర్ 3న హైకోర్టులో విచారణ ఉన్నందున ఆ తర్వాత మరోసారి ఈ అంశంపై చర్చించాలని నిర్ణయించినట్లు సమాచారం.

**పక్షం రోజుల్లో కొత్త డీసీసీలు**

పార్టీ సంస్థాగత నిర్మాణంలో ప్రధానపాత్ర పోషించే జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల నియామకాలను పక్షం రోజుల్లో పూర్తి చేయాలని ఏఐసీసీ నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా పరిశీలకుల నుంచి అందిన నివేదికలు, స్థానిక సమీకరణలు, నేతల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ సమర్థులైన వ్యక్తులను అధ్యక్షులుగా నియమించాలని నిర్ణయించారు. ముందునుంచీ చెబుతున్నట్లుగా పార్టీ పదవుల్లోనూ 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తూ, మహిళలకు ప్రాధాన్యమిస్తూ అన్ని వర్గాలవారికి న్యాయం చేయాలని భావిస్తోంది. మీనాక్షి నటరాజన్, రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథన్‌లతో కేసీ వేణుగోపాల్ ఇందిరాభవన్‌లో శనివారం సమావేశమై రెండు గంటలపాటు చర్చించారు. రాష్ట్ర పరిశీలకుల నుంచి వచ్చిన పేర్లను ముందుపెట్టుకొని జిల్లాలవారీగా నేతల నుంచి విడివిడిగా అభిప్రాయాలను సేకరించారు.

**కచ్చితంగా ఒక ఓసీ, ఒక బీసీ..**

ఈ భేటీలో ప్రధానంగా జిల్లాలవారీగా పరిశీలనకు వచ్చిన ముగ్గురు అభ్యర్థుల పేర్లపై అభిప్రాయాలను సేకరించినట్లు తెలిసింది. ప్రతి ముగ్గురు పేర్లలో ఒక ఓసీ, ఒక బీసీ ఉన్నారని చెబుతున్నారు. జిల్లాల్లో ఉండే కుల సమీకరణలు, అభ్యర్థి బలాబలాలు, పార్టీపై ఉన్న నిబద్ధతను పరిగణనలోకి తీసుకొని అభ్యర్థిత్వాలపై చర్చించారు. కొన్ని జిల్లాల నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల బంధువులు, మిత్రుల పేర్లు రాగా వాటిని పక్కనపెట్టారని, మరికొన్ని జిల్లాల్లో పార్టీ అధికారంలోకి వచ్చాక కొత్తగా చేరినవారి పేర్లను ప్రత్యేకంగా గుర్తించి జాబితా నుంచి తొలగించారని తెలుస్తోంది. ఇప్పటికే అధ్యక్ష పదవుల్లో ఉన్నవారిని సైతం జాబితాల నుంచి తొలగించి మిగతా పేర్లపైనే ఎక్కువగా చర్చలు జరిగినట్లు తెలిసింది. అభిప్రాయాల సేకరణ ప్రక్రియ పూర్తయిన దృష్ట్యా, ఇందులో 42 శాతం బీసీలు ఉండేలా హైకమాండ్ తన తదుపరి చర్చలు కొనసాగించనుంది. ప్రతి ఉమ్మడి జిల్లాకు ఒక ఓసీ, ఒక బీసీ అధ్యక్షుడు ఉండేలా అభిప్రాయాలు వచ్చినట్లు తెలిసింది. ఈ లెక్కన కచ్చితంగా 9 మంది రెడ్లు, 13%-%14 మంది బీసీలకు అవకాశం దక్కుతుందని చెబుతున్నారు.

**డీసీసీలకు మరింత స్వేచ్ఛ**

పార్టీ దీర్ఘకాలిక సంస్కరణల్లో భాగంగా జిల్లా యూనిట్లకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. నియోజకవర్గ అభ్యర్థులు మొదలు, పార్టీ, ప్రభుత్వ నియామకాల్లో వారి సూచనల మేరకే పదవుల పంపకాలు, జిల్లా స్థాయి సమస్యలపై పోరాటాలు చేసే స్వేచ్ఛ వారికి ఇచ్చే దిశగా ఈ భేటీలో సమాలోచనలు జరిగినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. సంస్థాగత ఎన్నికల నుంచి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలకు డీసీసీలే జవాబుదారీగా ఉండాలని, వారి అభిప్రాయం మేరకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పార్టీ విధానాల రూపకల్పన ఉండేలా భవిష్యత్తులో నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. 'కేసీతో సంస్థాగత వివరాలపై చర్చించాం. అడిగిన వివరాలు అందించాం. సలహాలు, సంప్రదింపులు జరిపాం'అని తెలిపారు. అయితే, ఎప్పటిలోగా డీసీసీలను ప్రకటిస్తారన్నది మాత్రం చెప్పలేదు. 15 రోజుల్లోగా డీసీసీలను ప్రకటించాలని ఏఐసీసీ భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

# రెండు రాష్ట్రాల్లో పార్టీని అధికారంలోకి తీసుకొస్తాం

**బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్‌రావు**

**పార్టీ బలోపేతంపై ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్‌తో చర్చలు**

**తెలంగాణలోనూ త్వరలో డబుల్ ఇంజిన్ సర్కార్: మాధవ్**



హైదరాబాద్: రెండు తెలుగు రాష్ట్రాల్లో తమ పార్టీని బలోపేతం చేయడంతోపాటు అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో పార్టీని బలోపేతం చేయడంపై రాంచందర్‌రావు, ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్‌లు శనివారం ఇక్కడి బీజేపీ కార్యాలయంలో చర్చలు జరిపారు. ఏపీ బీజేపీ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారి హైదరాబాద్‌కు వచ్చిన మాధవ్, రాంచందర్‌రావుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రెండు రాష్ట్రాల్లో కేంద్ర పథకాలు అమలవుతున్న తీరు, వాటిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లడంపై సమాలోచనలు జరిపారు. సమావేశం తర్వాత రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడుతూ, పార్టీని మరింత విస్తరిస్తామని తెలిపారు. మాధవ్ మాట్లాడుతూ.. గతంలో బీజేపీ యువమోర్చా, పార్టీ ఉపాధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా, జాతీయ కార్యదర్శిగా పనిచేసిన సందర్భాల్లో పలుమార్లు హైదరాబాద్ కేంద్రంగా కార్యక్రమాలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణలోనూ త్వరలోనే డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటు అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ కార్యాలయానికి రావడం స్వగృహానికి వచ్చినట్లుగా ఉందని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. ఏపీలోనూ విస్తృత పరిచయాలు ఉన్న రాంచందర్‌రావు ఇక్కడ అధ్యక్షుడు కావడం ఆనందంగా ఉందన్నారు.



# రేపు బంగాళాఖాతంలో తుపాను

**తదుపరి 24 గంటల్లో**

**తీవ్ర తుపానుగా మారే అవకాశం**

**రానున్న నాలుగు రోజులకు**

**ఎల్లో అలర్ట్ జారీచేసిన వాతావరణ శాఖ**

హైదరాబాద్: ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం మరింత బలపడి తీవ్ర అల్పపీడనంగా మారింది. ఇది క్రమంగా పశ్చిమ దిశలో కదిలి శుక్రవారం ఉదయం 5.30 గంటల ప్రాంతంలో వాయుగుండంగా మారింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో విశాఖపట్నం నుంచి ఆగ్నేయంగా 970 కిలోమీటర్లు, చెన్నైకి తూర్పు ఆగ్నేయంగా 970 కిలోమీటర్లు, కాకినాడకు ఆగ్నేయంగా 990 కిలోమీటర్ల దూరంలో ఇది కేంద్రీకృతమై ఉంది. ఈ వాయుగుండం మరింత బలపడి ఆదివారం ఉదయంకల్లా తీవ్ర వాయుగుండంగా మారనున్నట్లు వాతావరణ శాఖ స్పష్టం చేసింది. తదుపరి 24 గంటల్లో ఈ తీవ్ర వాయుగుండం బలపడి సోమవారం నాటికి తుపానుగా మారుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. అనంతరం తుపాను మరింత బలపడి ఈనెల 28వ తేదీనాటికి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆ తర్వాత తీవ్ర తుపాన్ ఉత్తర వాయవ్య దిశలో కదులుతూ కాకినాడకు సమీపంలో 28వ తేదీ సాయంత్రానికి తీవ్ర తుపానుగా తీరాన్ని దాటే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

**నాలుగు రోజులపాటు మోస్తరు వర్షాలు..**

బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం, తదుపరి తుపాను ప్రభావం రాష్ట్రంపైన మధ్యస్తంగా ఉంటుందని వాతావరణ శాఖ అంచనావేసింది. రానున్న నాలుగు రోజులుపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచిస్తోంది. కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కూడా నమోదు కావచ్చని చెబుతూ, రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

# హైదరాబాద్‌లో కాల్పుల కలకలం

పట్టుకునేందుకు వెంబడించారు. ఈ క్రమంలో దొంగల్లో ఒకరు డీసీపీపై కత్తితో దాడికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో డీసీపీ కిందపడిపోయారు. అనంతరం ఇద్దరు దొంగలు పారిపోయేందుకు ప్రయత్నించగా... డీసీపీ, గన్ మెన్ రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. దాంతో దొంగలు గాయపడి, పోలీసులకు పట్టుబడ్డారు. పోలీసులు ఇద్దరినీ అదుపులోకి తీసుకుని చికిత్స నిమిత్తం బంజారాహిల్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న సౌత్ ఈస్ట్ జోన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. స్వల్పంగా గాయపడిన డీసీసీ సాయి చైతన్యకు మలక్ పేట ఆసుపత్రిలో చికిత్స అందించారు. పట్టుబడిన నిందితుడి నేర చరిత్రపై పోలీసులు ఆరా తీస్తున్నారు. విధి నిర్వహణలో డీసీపీ సాయి చైతన్య చూపిన చొరవ, ధైర్యాన్ని పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# చొరబాటుదారులను వెళ్లగొట్టుడే..

**వారిని గుర్తించి,**

**ఓటు తొలగించి, స్వదేశాలకు పంపిస్తాం**

**కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టీకరణ**

నలంద: బిహార్‌లో జంగిల్‌రాజ్ మళ్లీ రావాలా? లేక రాష్ట్రం అభివృద్ధి పథంలో ప్రయాణం కొనసాగించాలా? అనేది ఈ ఎన్నికలే తేల్చబోతున్నాయని కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా చెప్పారు. చొరబాటుదారుల ఓట్ల కోసమే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)ను ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు. మన దేశంలో తిష్టవేసిన చొరబాటుదారులందరినీ గుర్తించి, ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించి, వారిని సొంత దేశాలకు పంపించడం తథ్యమని తేల్చిచెప్పారు. చొరబాటుదారులను బిహార్‌లో ఉండిపోనివ్వాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెబుతున్నారని ఆక్షేపించారు. చొరబాటుదారులను కాపాడేందుకు ఆయన ఎన్ని ర్యాలీలు నిర్వహించినా ఫలితం ఉండదని స్పష్టంచేశారు. చొరబాటుదారులను బయటకు వెళ్లగొట్టక తప్పదని పునరుద్ఘాటించారు. అక్రమంగా మనదేశంలోకి ప్రవేశించినవారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. రాహుల్ గాంధీ బిహార్‌లో ఓటర్ అధికార్ యాత్ర పేరిట చొరబాటుదారులను కాపాడే యాత్ర నిర్వహించారని ధ్వజమెత్తారు. అమిత్ షా శనివారం బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లో ప్రసంగించారు. రాష్ట్రంలో ఎన్డీఏ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. ప్రతిపక్షాల మాయమాటలు నమ్మొద్దని ప్రజలను కోరారు. ఒకవేళ లాలూ%-%రబ్రీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మరోసారి జంగిల్‌రాజ్ తప్పదని ఆందోళన వ్యక్తంచేశారు. ఎన్డీఏ మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే అభివృద్ధిలో బిహార్ మొత్తం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు.

**అందుకోసమే లాలూ, సోనియా ఆరాటం**

బిహార్‌లో నలంద యూనివర్సిటీ పూర్వ వైభవాన్ని ప్రధాని నరేంద్ర మోదీ పునఃప్రతిష్ఠించారని అమిత్ షా తెలిపారు. ఇప్పుడు వంద మంది భక్తియార్ ఖిల్జీలు వచ్చినా ఈ యూనివర్సిటీని ధ్వంసం చేయలేరని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వ సుపరిపాలన కారణంగానే బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు కేవలం రెండు దశల్లో జరుగుతున్నాయని చెప్పారు. లాలూ ప్రసాద్ యాదవ్ హయాంలో ఆరు దశల్లో ఎన్నికలు జరిగాయని గుర్తుచేశారు.

## గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు ఎప్పుడు?

స్వదేశానికి చేర్చేందుకు చొరవ తీసుకున్నందుకు వారు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ 'గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన తెలంగాణ కార్మికుల సంక్షేమం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి నిధులు కేటాయిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ప్రవాస తెలంగాణ వాసుల కోసం ప్రత్యేక పాలసీ తెస్తామని చెప్పారు. కానీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా ప్రభుత్వం ఒక్క హామీనీ నెరవేర్చలేదు. రాష్ట్రం నుంచి గెలిచిన బీజేపీ ఎంపీలతో పాటు కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి విదేశాల్లో చిక్కుకుపోయిన తెలంగాణ వాసులను తీసుకువచ్చేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడానికి చొరవ తీసుకోవాలి'అని డిమాండ్ చేశారు. జోర్డాన్‌లో చిక్కుకున్న 12 మంది తెలంగాణ వలస కార్మికులపై విధించిన జరిమానా కూడా చెల్లించి వారిని స్వదేశానికి తీసుకువచ్చాం అని హరీశ్‌రావు వెల్లడించారు. హరీశ్‌రావుతో భేటీ తర్వాత వారు జగిత్యాల, నిర్మల్, కామారెడ్డి, నిజామాబాద్, సిద్దిపేట జిల్లాల్లోని తమ సొంత ఊళ్లకు బయలుదేరి వెళ్లారు.

## నా ఓటమి వెనుక కుట్ర ఉందో లేదో బీఆర్ఎస్ కార్యకర్తలు ఆలోచించాలి: కవిత

భరించాను," అని గుర్తుచేసుకున్నారు. నిజామాబాద్ లో తన ఓటమి వెనుక పెద్ద కుట్ర జరిగిందని ఆరోపించిన కవిత, "ఏం జరిగిందో బీఆర్ఎస్ కార్యకర్తలు ఆలోచించాలి. జరిగిన కుట్ర గురించి పిల్లల్ని అడిగినా చెబుతారు" అని వ్యాఖ్యానించారు. ఇకపై తన ప్రయాణం ప్రజలతోనే అని స్పష్టం చేసిన కవిత, తన భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. "తెలంగాణ వచ్చి పదేళ్లు గడిచినా అమరవీరుల కుటుంబాలకు సరైన గౌరవం, న్యాయం దక్కలేదు. వారి కోసం పోరాడాల్సిన అవసరం ఉంది. ఈ 'జనం బాట'లో భాగంగా మేధావులు, విద్యార్థులు, రైతులు సహా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలతో మాట్లాడతాను. అందరి భాగస్వామ్యంతో ఆత్మగౌరవంతో కూడిన అభివృద్ధి సాధించడమే నా లక్ష్యం" అని తెలిపారు. జాగృతి సంస్థ ద్వారా విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత వంటి రంగాల్లో సేవలు కొనసాగిస్తానని ఆమె ప్రకటించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ప్రజలకు కవిత ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. "నిజామాబాద్ జిల్లా నా మెట్టినిల్లు. ఎంపీగా, ఎమ్మెల్సీగా నాకు పట్టం కట్టి నా రాజకీయ జీవితానికి శ్రీకారం చుట్టిన గడ్డ ఇది. అందుకే ప్రజల కష్టసుఖాలు తెలుసుకోవడానికి ఇక్కడి నుంచే 'జాగృతి జనం బాట'ను ప్రారంభించడం సముచితంగా భావించాను. నాకు ఘన స్వాగతం పలికిన జిల్లా ప్రజలకు, యువతకు నిండు హృదయంతో ధన్యవాదాలు" అని ఆమె పేర్కొన్నారు. కవిత తాజా వ్యాఖ్యలు, కొత్త కార్యక్రమం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

## తొలి దశలో 10-15 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్!

**::: కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు**

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రి య చేపట్టడానికి కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో తొలుత ఈ ప్రక్రియను పూర్తిచేయాలని నిర్ణయించినట్లు అధికార వర్గాలు శనివారం వెల్లడించాయి. అస్సాం, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, పశ్చిమ బెంగాల్‌లో 2026లో ఎన్నికలు జరగబోతున్నాయి. తొలి దశలో 10 నుంచి 15 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ నిర్వహించే అవకాశం ఉంది. తొలి దశ ఎస్ఐఆర్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను వచ్చే వారమే ప్రకటించనున్నట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో ఎస్ఐఆర్‌ను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని ఎన్నికల సంఘం భావిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న లేదా జరగబోయే రాష్ట్రాల్లో ఎస్ఐఆర్‌ను ఇప్పుడే ప్రారంభించవద్దని నిర్ణయించింది. ఎందుకంటే ఆయా రాష్ట్రాల్లో ఎన్నికల సంఘం అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బ ంది స్థానిక సంస్థల ఎన్నికల్లోనే తలమునకలై ఉంటారు. ఎస్ఐఆర్ విధుల్లో వారు పాల్గొనే పరిస్థితి ఉండదు కాబట్టి తదుపరి దశలోనే ఈ ప్రక్రియ చేపడతారు. బిహార్‌లో ఇటీవల ఎస్ఐఆర్‌ను పూర్తిచేసిన సంగతి తెలిసిందే. సమగ్ర సవరణ తర్వాత 7.42 కోట్ల మంది ఓటర్లతో తుది జాబితాను ఎన్నికల సంఘం ప్రచురించింది. అనర్హులైన 3.66 లక్షల మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించింది. ఓటర్లు మరణించడం, శాశ్వతంగా వలస వెళ్లడం, డూప్లికేట్ ఎంట్రీ తదితర కారణాలతో ఈ పేర్లను తొలగించినట్లు ఎన్నికల సంఘం తేల్చిచెప్పింది. ఇదిలా ఉండగా, పశ్చిమ బెంగాల్‌లో నవంబర్ 1 నుంచి ఎస్ఐఆర్ ప్రారంభించబోతున్నట్లు తెలుస్తోంది.




## ఆ రెండు చోట్లా ఉప ఎన్నికలు ఖాయం

ఆయన పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహంపై కేటీఆర్ పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ ఎన్నికలో పార్టీ గెలుపు ఖాయమని అన్నారు. భారీ మెజారిటీకోసం కష్టపడాలని నేతలకు సూచించారు. శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నాయకులందరూ కలసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌కు ఉన్న బలాన్ని ఈ ఉప ఎన్నికలో చాటాల్సిన అవసరం ఉందన్నారు. 'బీఆర్ఎస్ నాయకులు, జీహెచ్ఎంసీ కార్పొరేటర్లకు హైదరాబాద్ సమస్యలపై అవగాహన ఉంది. హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, అమలు చేసిన పథకాలను ప్రజలకు మరోసారి గుర్తు చేయాలి'అని కేటీఆర్ సూచించారు. ప్రచారంలో కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు గుర్తు చేయడంతో పాటు నగరంలో రోజురోజుకూ దిగజారుతున్న పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, మురికినీటి కాలువల నిర్వహణ వంటి సమస్యలను ఎత్తి చూపాలన్నారు. హైదరాబాద్ అభివృద్ధిని పక్కన పెట్టి, కాంగ్రెస్ కేవలం రాజకీయాలకే పాల్పడుతోందన్నారు.

**జూబ్లీహిల్స్ నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్ర**

జూబ్లీహిల్స్ నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభమవుతుందని, ఈ నియోజకవర్గంలో తిరిగి గులాబీ జెండాను ఎగురవేస్తామని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం తెలంగాణభవన్‌లో షేక్‌పేట డివిజన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు తోట మహేశ్‌తో పాటు పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కేటీఆర్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి ఓటుతో బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు.

# సి ఏ ఎస్ ఇంటర్వ్యూలో జరిగిన అవకతవకలపై నిజనిర్ధారణ కమిటీ వేయాలి

## సీనియర్ అధ్యాపకులకు న్యాయం జరిగే వరకూ నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయి





సికింద్రాబాద్ (వాయిస్ టుడే): ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన సి ఏ ఎస్ ఇంటర్వ్యూలో చాలామంది అధ్యాపకులకు ప్రమోషన్ రాకుండా రిజెక్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఔట అధ్యక్షులు ప్రొఫెసర్ మనోహర్ అన్నారు. ఈ మేరకు శనివారం లంచ్ అవర్ లో ఆర్ట్స్ కళాశాల ముందు అధ్యాపకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఔటా అధ్యక్షులు మనోహర్ మాట్లాడుతూ ప్రమోషన్ల విషయంలో అధ్యాపకులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. గత 22 రోజులకు పైగా అధ్యాపకులు నిరసనలు వ్యక్తం చేస్తున్న యూనివర్సిటీ అధికారులు, ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. ప్రమోషన్ల విషయంలో అధ్యాపకులకు న్యాయం జరిగే వరకూ వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ధర్నాలు రౌండ్ టేబుల్స్ సమావేశాల వంటి కార్యక్రమాలు సైతం చేపడతామన్నారు. ఇంతమంది సీనియర్ అధ్యాపకులకు ప్రమోషన్స్ ఇవ్వకుండా యూనివర్సిటీ ని హై స్టాండర్డ్‌లో ఏ విధంగా తీసుకెళ్లదలుచుకున్నారో ఓయూ వైస్ ఛాన్సలర్ స్పష్టం చేయాలన్నారు. అధ్యాపకులు చేస్తున్న నిరసన కార్యక్రమానికి రిపబ్లిక్ అని పార్టీ ఆఫ్ ఇండియా (భీమ్ రావు అంబేద్కర్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గాలి వినోద్ కుమార్ సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నతానియల్, వెంకట దాస్, సుజాత, రామచందర్, గంగాధర్, అపర్ణ రామకృష్ణ తదితరులున్నారు.



## ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పరమేశ్వర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనం

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):- ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఉప్పల్ నియోజకవర్గంలో ఆయన అభిమానులు నాయకులు కార్యకర్తలు మధ్యన ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్ పటేల్ నేతృత్వంలో పరమేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అభిమానులు 50 కిలోల ప్రత్యేక కేక్‌ను తయారు చేయించి పరమేష్ రెడ్డితో కేకును కట్ చేయించారు. బ్యాండ్‌లతో ర్యాలీతో పాటు ఆయన నివాసానికి అభిమానులు చేరుకుని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అక్కడ పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. అనంతరం కార్యకర్తలు నాయకులు అభిమానులు శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. మందముల పరమేశ్వర్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేయడానికి అనేక మంది యువజన కాంగ్రెస్ నాయకులు, హబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## గడపగడప వెళ్లి ప్రచారం నిర్వహించిన మాగంటి సునీత

జూబ్లీహిల్స్, 25 అక్టోబర్ (వాయిస్ టుడే ): రహేమత్ నగర్ డివిజన్ శ్రీరామ్ నగర్ లో గడప గడప వెళ్లి ప్రచారం నిర్వహించిన జూబ్లీహిల్స్ బి ఆర్ ఎస్ అభ్యర్థి మాగంటి సునీత...ఈ ప్రచారంలో ఇంచార్జ్.. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్యరావు..మహబూబ్ నగర్ మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్.. సీతాఫల్ మండి కార్పొరేటర్ హేమ శ్యామల.. రహేమత్ నగర్ మాజీ కార్పొరేటర్ షఫీ.. లియకత్ అలీ.. ధనుజ. నాగరాజ్.. కే ఎన్ రెడ్డి.. లలిత కే ఎన్ రెడ్డి.. అరుణ్.. వినోద్.. డి. విజయ్ భాస్కర్.. మైనార్టీ ఇన్చార్జ సయ్యద్ మసూద్.. రాష్ట్ర మైనార్టీ నాయకులు మహమ్మద్ సోహెల్. లలిత రెడ్డి..నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం అధ్యక్షుడుగా రోహన్ కాట్రాజ్ నియామకం

### అభినందించి శుభాకాంక్షలు తెలిపిన విద్యార్థులు



కూకట్ పల్లి, అక్టోబర్ 25(వాయిస్ టుడే): బంజారా హిల్స్‌లో తెలంగాణ జాగృతి పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కూకట్ పల్లి నియోజకవర్గం బాలాజీ నగర్ డివిజన్ ప్రగతి నగర్ వాత్సవ్యులైన రోహన్ కాట్రాజ్ ను కూకట్ పల్లి నియోజకవర్గం తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా రోహన్ కాట్రాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు సందర్బంగా రోహన్ మాట్లాడుతూ ఈ పదవి నియమించినందుకు అధ్యక్షురాలు కవితకు కృతజ్ఞతలు తెలుపుతూ అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గం లోని విద్యార్థులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను డివిజన్ల వారీగా గుర్తించి విద్యార్థుల సమస్యలపై పోరాడటానికి సిద్ధంగా ఉంటానని తెలిపారు. ప్రధానంగా బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై, అదేవిధంగా గురుకులాల్లోని విద్యార్థుల పట్ల జరుగుతున్న అనేక సమస్యలపై పోరాటాలు చేసి విద్యార్థులకు న్యాయం జరిగే వరకు వెనకడుగు వేసేదేలేదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి గెలుపు కోసం బోరబండలో పోతగాని గోపాల్ గౌడ్ ప్రచారం



నాచారం (వాయిస్ టుడే):జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోని బోరబండ డివిజన్ వినాయక రావు నగర్ పలు బస్తీలలో ఉన్న ఓటర్లను కలసి కమలం గుర్తుకు ఓటు వేసి, BJP అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి గారిని గెలిపించాలని బూతు నెంబర్ 314 లో ప్రచారం చేస్తున్న ఉప్పల్ నియోజకవర్గ నాచారం డివిజన్ బీజేపీ నాయకులు మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్, ఈ ప్రచారంలో నాచారం డివిజన్ నాయకులజిల్లా OBC మోర్చా నాయకులు హనుమంత్ బిరాధర్,డివిజన్ మహిళమోర్చ అధ్యక్షురాలు మంజులవాని, నవీన్ చింటూ,క్రాంతికుమార్, బోరబండ డివిజన్ నాయకులు అభిషేక్ నాయక్, సాయి పాల్గొన్నారు.



## కెసి గుప్తా సేవలు చిరస్మరణీయం

కాచిగూడ, అక్టోబర్ 24 : వైశ్యుల అభివృద్ధికి స్వాతంత్ర్య సమరయోధుడు, వాసవి క్లబ్ వ్యవస్థాపకులు కెసి గుప్తా చేసినసేవలు చిరస్మరణీయమని వైశ్య ప్రముఖులు బచ్చు ప్రకాష్ అన్నారు. ఆర్య వైశ్య సంఘం ఇసామియా బజార్ అధ్యక్షుడు కల్వకుంట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం సంఘం హాల్లో కెసి గుప్తా వర్థంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘం హాల్లో ఉన్న కెసి గుప్తా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆర్య వైశ్యులు తమ వ్యాపారాలకే పరిమితం కాకుండా సామాజిక సేవా కార్యక్రమాలలో ముందుకు సాగుతూనే రాజకీయాల్లోనూ రాణించాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ఇసామియా బజార్ నేతలు కొమిరిశెట్టి అనిల్ కుమార్, బెజుగం శ్రీధర్, కల్వకుంట్ల సందీప్, సంఘం జీవితకాల సభ్యులు, వైశ్య ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

## శరీర దేహదారుడ్యానికి మానసిక ఉల్లాసం కోసం క్రీడలు ఎంతో అవసరం: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న




యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో... ( వాయిస్ టుడే ప్రతినిధి):- విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. శనివారం భువనగిరి పట్టణంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానములో69 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 19 బాలుర స్టేట్ లెవెల్ వాలీబాల్ పోటీలును ఈ పోటీలకు ముఖ్య అతిధి గా తీన్మార్ మల్లన్న , స్థానిక సంస్థ ల అదనపు కలెక్టర్ భాస్కరరావు , జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రమణి లు పాల్గొని ప్రారంభించారు. ఈ పోటీలలో ఉమ్మడి 10 జిల్లాలు క్రీడాకారులు క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమములో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ క్రీడలు శరీర మానసికోల్లాసానికి ఎంతగానో తోడ్పడుతాయని తెలిపారు విద్యార్థులు అందరు ఇలాంటి పోటీలలో పాల్గొని ఆరోగ్యంగా ఉండాలని, క్రీడారంగములో జిల్లాను ప్రథమస్థానములో నిలపాలని, క్రీడాకారులకు తనవంతు సహకారమునకు అందిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## నూతన వధూవరులకు ఎంపీ వద్దిరాజు ఆశీస్సులు

శంషాబాద్ : బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర నూతన వధూవరులు రశీద్ హుస్సేన్-రబియా మీర్జాలను ఆశీర్వదించారు. వీరి పెళ్లి ఈనెల 23వతేదీన జరుగగా, రిసెప్షన్ శనివారం రాత్రి శంషాబాద్ సమీపాన సాతంరాయ్ కశిష్ ఫంక్షన్ హాలులో ఘనంగా ఏర్పాటైంది. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర తన ధర్మపత్ని విజయలక్ష్మీతో కలిసి నూతన వధూవరులకు పుష్పగుచ్ఛాలిచ్చి తమ ఆశీస్సులు అందజేశారు. వారి తల్లిదండ్రులు జకీర్ హుస్సేన్-రషీదా ఖన్నం, మీర్జా మహమూద్ బేగ్ -వసియా బేగంలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## ఫోన్లో పరిచయమై నమ్మించి ఓ వ్యక్తి నుంచి డబ్బులు వసూలు చేసిన ఘరానా మహిళ అరెస్ట్



నాచారం, (వాయిస్ టుడే): సెల్ఫోన్లో మాట్లాడుతూ పరిచయం పెంచుకొని ఓ వ్యక్తి దగ్గర నుంచి లక్షలల్లో డబ్బులు వసూలు చేసిన ఘరానా మహిళను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించిన సంఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాచారం ప్రాంతానికి చెందిన గంట్యాడ అప్పారావు ఏ ఆనంద్ అనే వ్యక్తికి అనూష అనే ఫోన్ ద్వారా పరిచయం అయింది. పరిచయంలో అతడిని నమ్మించిన అనూష ఆమెకి తెలిసిన మరో వ్యక్తి మహేష్ తో కలిసి వారి అవసరాల కోసం అప్పారావు నుంచి సుమారు రూ 04 లక్షల 50 వేల వరకు వివిధ సందర్భాలలో వసూలు చేసింది. డబ్బులు తీసుకుని తీసుకోని తిరిగి ఇవ్వకుండా అతనిని మోసం చేసింది. ఈ విషయమై బాధితుడు 2025 ఏప్రిల్ నెలలో నాచారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఇన్స్పెక్టర్ ధనుంజయ అధ్వర్యంలో ఎస్సై ప్రభాకర్ రెడ్డి దర్యాప్తు చేసి అనూష అరెస్టు చేసి రిమాండ్ కి తరలించారు.

## ఎంటిపిఏఆర్ కార్మిక గుర్తింపు ఎన్నికల్లో బీఆర్టీయు

### మాజీ మంత్రి అధ్యక్షుడు డా.వి.శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మాయ రాజయ్య



కూకట్ పల్లి, అక్టోబర్ 25(వాయిస్ టుడే): కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలానగర్ పారిశ్రామికవాడలో ఉన్న ఎంటీఏఆర్ టెక్నాలజీస్ లిమిటెడ్ పరిశ్రమలో జరిగిన గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో కంపెనీ ప్రధాన కార్యదర్శి మాయ రాజయ్య సారథ్యంలో కార్మికుల ఆశాజ్యోతి మాజీ మంత్రి డా.వి.శ్రీనివాస్ గౌడ్ భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ బీఆర్ టీయు తరపున పోటీ చేసి సమీప డీసీఎంఎస్ అభ్యర్థి మెదక్ ఎంపీ రఘునందన్ రావు పై ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి తన శ్రేయోభిలాషి అయిన జనరల్ సెక్రటరీ రాజయ్యను ఇతర నాయకులతో కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్ యాదవ్, అక్కిరెడ్డి, మాయ బాల నర్సయ్య, కిరణ్, రాజేష్, సుధాకర్, కిశోర్ మరియు ఇతర కార్మిక నాయకులు పాల్గొన్నారు.



## ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల పై నిరంతరం తనిఖీ చెయ్యండి

### ఉప్పల్ రవాణా కార్యాలయం అధికారికి సిపిఐ వినతి

నాచారం (వాయిస్ టుడే):కర్నూలు లో జరిగిన బస్సు ప్రమాదం చాలా బాధాకరమని దానికి గల కారణం ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యల నిర్లక్ష్య వైఖరి కాబట్టి వెంటనే అలాంటి ట్రావెల్స్ మన పరిధిలో ఉంటే చట్ట పరమైన చర్యలు తీసుకోవల్సి నేడు సిపిఐ ఆధ్వర్యంలో ఉప్పల్ లో గల ఆర్ టి ఏ కార్యాలయంలో అధికారి ఏం. రవీందర్ రెడ్డి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్బంగా సిపిఐ ఉప్పల్ మండల కార్యదర్శి టి .సత్య ప్రసాద్, సిపిఐ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ లు మాట్లాడుతూ కర్నూల్ సంఘటన చాలా బాధాకరమని,ఆ ప్రమాదం సంఘటనతోనైనా అధికారులు ప్రైవేట్ ట్రావెల్స్ చేసే మోసలను గ్రహించి మరోసారి ఇలాంటి ప్రమాదం జరగకుండా ఇక్కడి ట్రావెల్స్ యాజమాన్యలను పిలిపించి తగు సూచనలు చెయ్యాలని,ఎవ్వరు కూడా నకిలీ రిజిస్ట్రేషన్ లేకుండా నకిలీ లైసెన్స్ గల డ్రైవర్లను పెట్టకుండా,ఇతర రాష్ట్రాల పెర్మిషన్ తో ఇక్కడ నడపకుండా చెయ్యాలని , అదేవిధంగా తనిఖీలు చేసి ఫిట్నెస్ లేని ట్రావెల్ బస్సులను సీజ్ చేయాలని వారు కోరారు. రాబోయే రోజుల్లో సిపిఐ ఆధ్వర్యంలో ప్రైవేట్ ట్రావెల్స్ పై నిఘా ఉంచి అవకతవకలు లేకుండా చూస్తామని దానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఉప్పల్ మండల్ సహాయ కార్యదర్శి బషీర్ అలీ, కౌన్సిల్ సభ్యులు రాములు ,మల్లేష్ సిపిఐ మేడిపల్లి కౌన్సిల్ సభ్యులు బాపు రాజు మహేష్, జి ఐలయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం

హైదరాబాద్
ఆదివారం, 26 అక్టోబరు 2025



## యాదగిరిగుట్టలో 'అమ్మకు భరోసా' కార్యక్రమం విజయవంతం

### గర్భిణీ స్త్రీకి పోషకాహార కిట్ అందజేత

యాదగిరిగుట్ట, 25 అక్టోబర్ 2025: గర్భిణీ స్త్రీలు మరియు తల్లుల ఆరోగ్య సంరక్షణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అమ్మకు భరోసా' కార్యక్రమంలో భాగంగా, నేడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (DMHO) డా. మనోహర్ యాదగిరిగుట్ట న్యూ గుండ్లపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా, డా. మనోహర్ గారు శ్రీమతి విజయ కుమారీ నివాసానికి వెళ్లి ఆమెను పరామర్శించారు. తల్లికి మరియు బిడ్డకు అవసరమైన పోషకాహార విలువలతో కూడిన ప్రత్యేక పోషకాహారం కిట్‌ను ఆమెకు అందజేశారు.

**అధికారి పర్యవేక్షణ మరియు సలహాలు**

పర్యటనలో భాగంగా, డా. మనోహర్ శ్రీమతి విజయ కుమారీ యొక్క ఇటీవల MEDICAL రిపోర్టులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గర్భధారణ సమయంలో సరైన పోషకాలను తీసుకోవాల్సిన ఆవశ్యకతపై నొక్కి చెబుతూ, ఆమెకు ప్రత్యేక ఆహార నియమాలు మరియు జీవనశైలిపై విలువైన సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పవని, కమ్యూనిటీ హెల్త్ సేవక్ (CH Sevak) వెంకటమ్మ, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (MPHW) బి. శాలినీ, మరియు ఆశా వర్కర్ ఎం. వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

డా. మనోహర్ మాట్లాడుతూ, "ప్రతి తల్లి మరియు బిడ్డ ఆరోగ్యంగా ఉండటమే మా లక్ష్యం. ఈ 'అమ్మకు భరోసా' కార్యక్రమం ద్వారా, గర్భిణీ స్త్రీలకు నేరుగా అవసరమైన సహాయం, పర్యవేక్షణ మరియు వైద్య సలహాలు అందిస్తున్నాము. పౌష్టికాహార లోపాన్ని నివారించి, ఆరోగ్యవంతమైన తరాలను సృష్టించడమే దీని ప్రధాన ఉద్దేశం," అని తెలియజేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఈ ప్రాంతంలోని ప్రతి గర్భిణీ స్త్రీకి నిరంతర ఆరోగ్య సహాయం అందించడానికి కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు.ం

## పాము కాటుతో వృద్ధుడు మృతి



కృష్ణా జిల్లా గన్నవరం: గన్నవరం మండలం గొల్లనపల్లి గ్రామంలో విష పురుగు కాటుకు ఒక వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు బోబ్బా సీతారామయ్య 80 అనే వృద్ధుడు పంట పొలంలో వ్యవసాయ కార్యకలాపాలు నిమిత్తం శనివారం ఉదయం తెల్లవారుజామున పంట పొలాల్లోకి వెళ్లారు.విష పురుగు కాటుకు గురయ్యారు..ఈ క్రమంలో సమాచారం అందుకున్న బంధువులు, స్థానికులు హుటాహుటిన చిన్న అవుటపల్లి లోని పిన్నమనేని ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ సీతారామయ్య మృతి చెందారు. మృత దేహానికి గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టంనిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగించారు. గన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ప్రభుత్వ మాధ్యంలో ఏర్పాటు చేసిన మొక్కలను తొలగించడంతో ప్రజల ఆగ్రహం

చేవెళ్ల... అక్టోబర్ 25(వాయిస్ టుడే): శంకర్ పల్లి మండలం మాసానీ గూడా గ్రామ గేటు వద్ద ప్రభుత్వం నిర్వహించిన హరితహారం లో భాగంగా నాటిన మొక్కలను ప్రైవేటుగా కొనుగోలు చేసిన పట్టదారులు తమ యొక్క కరెంటు స్తంభాలను రోడ్డు వైపులా పాతడానికి, నాటిన మొక్కలను ఎలాంటి అనుమాతులు లేకుండా తొలగించడం జరిగింది .మామూలుగా చెట్లను కొట్టివేయాలంటే ప్రభుత్వం అటవీశాఖ అనుమతులు తీసుకోవాలి కానీ ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ప్రభుత్వ మాధ్యంలో ఏర్పాటు చేసిన మొక్కలను తొలగించడంతో ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



## అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కళాకారుల దినోత్సవం

మెటుపల్లి.వాయిస్ టుడే న్యూస్ ప్రతినిధి.అక్టోబర్ 25: కళాకారుల దినోత్సవం సందర్భంగా అమ్మ చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో మెటుపల్లి మండలం వెల్లుల్ల గ్రామానికి చెందిన కళాకారుడు ప్రస్తుత ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ యూఏఈ అధ్యక్షులు బత్తిని రాజాగౌడ్ ను అమ్మ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు పుల్ల శ్రీనివాస్ గౌడ్ శనివారం శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ...... దుబాయ్ లో మా గల్ఫ్ సంస్థ కార్మిక గీత ఆలాపనలో ఆన్లైన్ పాటల పోటీలో థర్డ్ సింగర్ అవార్డ్ బత్తిని రాజాగౌడ్ కు రావడం జిల్లాకే గర్వకారణమన్నారు.అలాగే గల్ఫ్ కార్మికుల సమస్యల పై గత కొన్ని సంవత్సరాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ల దృష్టికి తీసుకొనిపోవడం,కార్మికులకు వివిధ రకాల సేవలు రాజా గౌడ్ చేయడం హర్షనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యస్ మల్లేష్,పి గంగాధర్,వి,సందీప్,రాజేష్, కె,కిరణ్ పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ,అక్రమ గర్భస్రావాల నివారణకు స్కూల్లు, కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

### యాదాద్రి భువనగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు



యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో... ( వాయిస్ టుడే ప్రతినిధి):- యాదాద్రి భువనగిరి జిల్లాలో పిసి %ఌ% పిఎన్డిటి చట్టం 1994 అమలుపై భాస్కర్ రావు, అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీ) అధ్యక్షతన జిల్లా అప్రోప్రియేట్ అథారిటీ సమావేశం శనివారం మధ్యాహ్నం 2:30 గంటలకు కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్,యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా అప్రోప్రియేట్ అథారిటీ కమిటి సభ్యులైన మాధవి లతా, గౌరవ జడ్జి, సెక్రటరీ, జిల్లా లీగల్ సెల్ అథారిటి అడిషనల్ డీ.సీ.పీ భువనగిరి సి.యచ్. లక్ష్మి నారాయణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎం. మనోహర్, డా. యల్. యశోద, ప్రోగ్రాం అధికారి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి డా. బి. ప్రమీల తో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశంలో ప్రధానంగా జిల్లాలో పిసి అండ్ పిఎన్డిటి చట్టం అమలుపై, ఐ ఈ సి మెటీరియల్ ద్వారా లింగ నిర్ధారణ,అక్రమ గర్భస్రావాల నివారణకు స్కూల్లు, కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు తెలియచేసారు. లింగ నిర్ధారణ, అక్రమ గర్భస్రావాల నివారణకు జిల్లా స్థాయిలో హెల్ప్‌లైన్ నంబర్ 8074261809 ప్రతి ప్రభుత్వ కార్యాలయాలలో ఏర్పాటు చేయాలనీ చేయాలన్నారు, ఎవరైనా లింగ నిర్ధారణ, అక్రమ గర్భస్రావాల తీసినట్లు ఐతే జిల్లా స్థాయిలో హెల్ప్‌లైన్ నంబర్ పిర్యాదు పిర్యాదు చేయగలరని తెలియచేసారు. జిల్లాలో 2020 నుండి 2025 మధ్య 5 సంవత్సరాల గణాంకాల ఆధారంగా మండలాల వారీగా బాలబాలికల జనన నిష్పత్తిపై సమీక్షించడం జరిగింది. లింగ నిష్పత్తి మెరుగుపరచడానికి అవసరమైన చర్యలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని. జిల్లాలో నూతన స్కానింగ్ సెంటర్లకు అనుమతి, పునర్నవీకరణ, సవరణలకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలించడం జరిగింది. మండలాల వారీగా గర్భిణీ మహిళల ఏ ఎన్ సి ట్రాకింగ్, ఆయా మండలాల్లో (ఎడ్ ఎక్స్పెక్టెడ్ డేట్ ఆఫ్ డెలివరీ) కి రాకుండా ఉన్న మహిళల వివరాలు సమీక్షించనున్నారు. అలాగే ఇంటెలిజెంట్ రిస్క్ అనాలిసిస్ ఆధారంగా రిజిస్ట్రేషన్ లేని కేసుల గుర్తింపు చేపట్టాలన్నారు. ప్రతి జిల్లాలో వాట్సాప్ ఆధారిత ఫిర్యాదు వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ప్రజలకు చట్టంపై అవగాహన పెంచే దిశగా ఇది ఉపయుక్తంగా ఉంటుంది. జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశాల నివేదికలను రాష్ట్ర అధికారులకు సమర్పించాలనే అంశం కూడా చర్చించడం జరిగింది. జిల్లా లో ఉన్న ప్రైవేటు, ప్రభుత్వ స్కానింగ్ సెంటర్ గైనకాలజిస్ట్ మరియు రేడియాలజిస్ట్ పి.సి %ఌ% పి.యన్.డి.టి ఆక్ట్ మరియు స్కానింగ్ సెంటర్ల నిర్వహణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలియజేశారు. ప్రతి నెల స్కానింగ్ సెంటర్ల ని తనిఖి చేసి ఫారం %-% యఫ్ ఆడిట్ చేయాలన్నారు, జిల్లా లో లింగ నిష్పత్తిని వ్యత్యాసాన్ని తగ్గించలన్నారు. జిల్లా లో డెకయ్ ఆపరేషన్లు చేయాలన్నారు. ఎవరైనా లింగ నిర్ధారణ పరిక్షలు నిర్వహిస్తే పి.సి %ఌ% పి.యన్.డి.టి ఆక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అన్నారు.ఈ సందర్భంగా ఎం.హనుమంతరావు, ఐ.ఏ.ఎస్, జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్స్ డే సందర్భంగా కేకు కట్ చేసి డాక్టర్లకు శుభాకాంక్షలు తెలియచేసి చేయడం జరిగింది.ఈ సమావేశంలో డా. సాయి శోభ, డా. శిల్పిని, వి. అంజయ్య,డివై. డెమో.వసంత కుమారి, మరియు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి మేడి నరేష్ రాజీనామా



ఎల్ బి నగర్ అక్టోబర్ 25(వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల పట్ల వ్యవహారశైలి ,విధి విధానాల తీరుపై కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయాలని నిర్ణయించుకోవడం జరిగింది. ఇక పై ఈరోజు నుండి నాకు కాంగ్రెస్ పార్టీకి ఎటువంటి సంబంధం లేదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మేడి నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాజకీయాల కంటే, నాయకుల కంటే నా ఆత్మగౌరవం నాకు ముఖ్యం. ఎంతటివారైన సాధారణ మనుషులేనని నేను విశ్వసిస్తాను అని ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఎవరికైనా భారత రాజ్యాంగం సమాన హక్కులు కల్పించింది. ప్రజల ఆశీర్వాదంతో నాయకులు అవుతారు. పదవులు శాశ్వతం కాదు. ప్రజల పట్ల గౌరవం, విశ్వాసం ఉండాలని ,అసమానతలు చూపొద్దని కోరుతున్నాను అని వివరించారు నియోజకవర్గ ప్రజలకు నాయకులు న్యాయం చేసి కాపాడుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నానని అడ్డగోలుగా ఆస్తులు సంపాదించి విలువలు లేని వ్యవహార శైలి సరైంది కాదన్నారు ప్రజలు అందరికీ అవకాశం కల్పిస్తారు. మీకన్నా ముందు ఎంతో మంది మేధావులు కనుమరుగయ్యారు. పార్టీలు మారిన వారికి అనుకూలంగా అంద దండలు. సీనియర్లను కనీసం గుర్తింపు లేకుండా పోతుంది అని వాపోయారు ఈ ప్రభుత్వం ఉంటుందో లేదో కానీ ప్రజలకు మాత్రం అభివృద్ధి శూన్యం.కొంతమంది నాయకులకు అహంకారం పనికిరాదు. ఎన్నో సందర్భాల్లో ఇబ్బందులు ఎదురుకున్న విషయాలు అనేకం అని అన్నారు. నాయకుల ప్రవర్తన పట్ల భావోద్వేగానికి లోనై రాజీనామా చేస్తున్నట్లు మేడి నరేష్ ఒక ప్రకటన విడుదల చేశారు బలహీన వర్గాల కోసం మేడి నరేష్ జర్నలిస్ట్ గా నా సేవలు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు అయినటువంటి మేడి నరేష్ అన్నారు. ఇక పై ఏపార్టీ నాయకుడైన మంచిని మంచే అంటాను, చెడు నీ బరాబర్ బయటికి తీస్తాను.అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మేడి నరేష్ రాజీనామా చేసి మాట్లాడారు.

## పోలీస్ అమరవీరుల స్మారకార్థం మెగా రక్తదాన శిబిరం

### రక్తదానం ద్వారా ప్రాణదాతలుగా నిలుద్దాం: పెద్దపల్లి డిసిపి కరుణాకర్



సుల్తానాబాద్, పెద్దపల్లి జిల్లా అక్టోబర్-25 వాయిస్ టుడే: ఆపదలో ఉన్నవారికి రక్త దానం చేయడం వల్ల ప్రాణదాతలు అవుతారని పెద్దపల్లి డిసిపి కరుణాకర్ అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా సుల్తానాబాద్ పోలీస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం కు అపూర్వ స్పందన లభించింది, ఈ శిబిరంలో కాల్వ శ్రీరాంపూర్, ఓదెల, ఎలిగేడు, జూలపల్లి, సుల్తానాబాద్, పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలీస్ సిబ్బంది తోపాటు యువత పాల్గొని పెద్ద ఎత్తున రక్తాన్ని అందించారు. ఈ సందర్భంగా డిసిపి కరుణాకర్ మాట్లాడుతూ అనేక సందర్భాలలో రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు రక్తం అందక చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని, రక్తాన్ని దానం చేస్తే ఆపద సమయంలో ఆదుకొని మరొకరి ప్రాణం కాపాడిన వారు అవుతారన్నారు. యువత సన్మార్గంలో ప్రయాణించి శాంతి భద్రతల పరిరక్షణకు పాటుపడాలని పోలీసులకు సహకరించాలని, ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తే ఏలాంటి ప్రమాదాలు సంభవించవని, పోలీసులు ప్రజల కోసమే ఇరవై నాలుగు గంటలు విధి నిర్వహణలో ఉంటారని, పోలీసులకు ప్రజలకు మధ్య సత్ప్రవర్తన కలిగి ఉండాలని తద్వారా సమాజం శాంతి మార్గంలో ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు సేవలందించడం లో అనేకమంది పోలీసులు అమరులయ్యారని వారి స్మారకార్థం వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మృతి చెందిన పోలీస్ అమరవీరుల కు రెండు నిమిషాలు మౌనం పాటించారు.ఈకార్యక్రమంలో పెద్దపల్లి ఏసిపి గజ్జి కృష్ణ, పెద్దపల్లి, సుల్తానాబాద్ సిఐ లు సుబ్బారెడ్డి, ప్రవీణ్ కుమార్, సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, శ్రావణ్ కుమార్, అశోక్ రెడ్డి, వేణుగోపాల్ , రమేష్, సన్నత్ కుమార్, మధుకర్, రెడ్ క్రాస్ పెద్దపెల్లి జిల్లా డిస్ట్రిక్ట్ చైర్మన్ కావేటి రాజుగోపాల్, లయన్స్ క్లబ్ ప్రతినిధి వలస నీలయ్య, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు ముస్త్యాల రవీందర్ తో పాటు సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ ల సిబ్బందితో పాటు, పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు, రక్తదానం చేసి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి సిఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్ కుమార్ లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు..

# ఎస్ ఎల్ ఎన్ ఎస్ జూనియర్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ పార్టీ

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట పట్టణంలోని ఎస్ ఎల్ ఎన్ ఎస్ జూనియర్ కళాశాలలో శనివారం ఘనంగా ఫ్రెషర్స్ పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఆరుట్ల కిషోర్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటలలో సంస్కృతిక కార్యక్రమాలలో ముందుండాలని అన్నారు . చదువులో రాణించేందుకు విద్యార్థులు ముందు నుంచి కష్టపడాలని అన్నారు. నూతనంగా కళాశాలలో చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఈ ఫ్రెషర్స్ పార్టీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా యాదగిరిగుట్ట ప్రింటు మీడియా యూనియన్ నేతలు హాజరయ్యారు. యాదగిరిగుట్ట ప్రింట్ మీడియా యూనియన్ గౌరవ అధ్యక్షులు కళ్లెం సంపత్ , యూనియన్ అధ్యక్షులు బూడిద శ్రీహరి, వర్కింగ్ ప్రెసిడెంట్ సిహెచ్ శేఖర్ , ఉపాధ్యక్షులు పుట్ట హనుమంత్, ప్రధాన కార్యదర్శి ఇండ్ల మచ్చేందర్ , కోశాధికారులు ఆరుట్ల కిషోర్ కుమార్, డంగు నరేందర్, ప్రచార కార్యదర్శి మొగిలిపాక కనకరాజు, సంయుక్త కార్యదర్శులు బి అమర్నాథ్ , కార్యవర్గ సభ్యులు శిఖ సాయి కిషోర్ , కర్రే




గణేష్ , ఓరుగంటి శివకుమార్ , తదితరులు పాల్గొన్నారు. కాగా వారిని ఎస్ ఎల్ ఎన్ ఎస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ , ప్రింట్ మీడియా యూనియన్ కోశాధికారి ఆరుట్ల కిషోర్ కుమార్ శాలువాలతో సత్కరించి స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు . అనంతరం ప్రింట్ మీడియా యూనియన్ నేతలు కళాశాల ప్రిన్సిపల్ ఆరుట్ల కిషోర్ కుమార్ దంపతులను శాలువాలతో సత్కరించి జ్ఞాపకను అందించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. జానపద, సినిమా, భక్తి పాటలపై విద్యార్థులు చేసిన డ్యాన్సులు , కామెడీ స్కిట్స్ అలరించాయి . అదేవిధంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆరుట్ల కిషోర్ కుమార్ కుమారులు ప్రత్యేకంగా ప్రదర్శించిన తబలా, కీబోర్డు ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు భవిష్యత్తులో ఎలా ఎదగాలి అనే అంశంపై మార్గ నిర్దేశం చేశారు. విద్యార్థిని విద్యార్థులు తమ యొక్క అభిప్రాయాలను , ఆనందాన్ని మధుర జ్ఞాపకాలను విద్యార్థులతో పంచుకున్నారు. విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు పలువురు అతిథులు హాజరైన ఈ కార్యక్రమం ఆద్యంతం ఆసక్తిగా పెద్ద ఎత్తున కొనసాగింది.

# పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలి

## ఎస్ఆర్ఆర్ కళాశాలలో ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ కళాశాల హాస్టళ్లను మంజూరుచేయాలి




కరీంనగర్,అక్టోబర్ 25(వాయిస్ టుడే): భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల గేట్ ముందు పెండింగ్లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని మరియు నూతన హాస్టల్ లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి గట్టు ఆకాష్ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్,ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ప్రభుత్వం పైన వారు మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్న విద్యారంగ సమస్యను పరిష్కరించడంలో పూర్తిగా విఫలం అయ్యిందని విద్యార్థుల జీవితాలను చిక్కుల్లో పెట్టే పని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని వారు అన్నారు. అటు ప్రైవేట్ కళాశాల యజమాన్యలతో చర్చలు జరిపి కూడా విడుదల చేయవలసిన బకాయిలను విడుదల చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేశారు,పై చదువులకు వెళ్దామంటే విద్యార్థులకు ప్రభుత్వం పైన నమ్మకం కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ మీద ఆధారపడి చదువుకునే విద్యార్థులు అధిక సంఖ్యలో రాష్ట్రవ్యాప్తంగా ఉంటారు,అట్లాంటి విద్యార్థులకు అన్యాయం చేసే కుట్ర రేవంత్ రెడ్డి సర్కార్ చేస్తుందని అన్నారు. ఎస్ఆర్ఆర్ కళాశాలలో ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ కళాశాల హాస్టల్ లను నిర్మించాలని దానిని మంజూరు చేయవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఉత్తర తెలంగాణ కేంద్రంగా ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులు చదువుకుంటున్నారని వారికి సరైన హాస్టల్ వసతి లేనందువలన ప్రభుత్వ హాస్టల్లో పైన ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది కానీ హాస్టల్లో విద్యార్థులకు సరిపడా వసతులు కల్పించడంలో విఫలం అవుతున్నారు అని, విద్యార్థులకు సరిపడా సీట్ల సంఖ్యను పెంచాలని విద్యార్థిని విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వం పని చేయాలని ఆకాంక్షించారు. బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎస్ఆర్ఆర్ కళాశాల విద్యార్థిగా అంచెలంచెలుగా ఎదిగిన ఘనత ఉద్యమ స్ఫూర్తిని కళాశాల ఇచ్చిందని అట్లాంటి కళాశాల అభివృద్ధికి మరియు హాస్టల్ అభివృద్ధికి నిర్మాణానికి శ్రద్ధ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.శిథిలావస్థలలో కళాశాల ఉందని దానిని సమస్యలను పరిష్కరించి నూతన భవనాల నిర్మాణానికి పాటుపడాలని మరియు సంక్షేమ హాస్టల్ ఏర్పాటుకు కృషి చేయాలని, పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రాయిర్స్మెంట్ తక్షణమే విడుదల చేయవలసిందిగా వారు డిమాండ్ చేశారు.లేనియెడల పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అర్చన,శ్రీలక్ష్మి,గన్నరపు రాకేష్, రాజు,రాకేష్,రఘు,అభిలాష్, శ్రావణ్,రాజు,శీను,రజనీకాంత్, అన్వేష్,రంజిత్,చరణ్,దుర్గా, రవితేజ,సన్నీ,రంజిత్, ప్రభాకర్, విష్ణు, బద్రి పాల్గొన్నారు.



## వేములవాడ రాజన్న ఆలయంలో సామూహిక కార్తీక దీపోత్సవ ప్రారంభం

రాజన్న సిరిసిల్ల జిల్లాబీ అక్టోబర్ 25: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు తేది: 22-10-2025 (బుధవారం) నుండి తేది: 20-11-2025 (గురువారం) వరకు సామూహిక కార్తీక దీపోత్సవం కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

ఈ సందర్భంగా శనివారం సాయంత్రం మూడవ రోజు. భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జ్యోతి ప్రజ్వలన చేసి సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా ప్రారంభించారు. భీమేశ్వర స్వామి ఆలయ దేవాలయంలో సేవా సమితి సభ్యులు భక్తి గీతాలు, భజనలతో భక్తులను అలరించారు. కార్తీక మాస పర్వదినాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ సామూహిక కార్తీక దీపోత్సవ కార్యక్రమం ప్రతి రోజూ సాయంత్రం 6:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు సుహాసినీల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించబడుతుందని అధికారులు తెలిపారు.



## నవభారతి ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను ప్రారంభించిన మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

కరీంనగర్,అక్టోబర్ 25(వాయిస్ టుడే):హెూమ్ కేర్ ప్రొడక్ట్స్ నవభారతి ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను మానకొండూర్ ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా మదర్ డిపోను కరీంనగర్ లో ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవభారత్ ప్రొడక్ట్స్ అందరూ వాడాలని,మిగతా ప్రొడక్ట్స్ కంటే తక్కువ ధరలతో కొనుగోలుదారులకు సరసమైన ధరలకు అందుబాటులో ఉన్నాయని అన్నారు.వీటిలో హెూమ్ కేర్,కార్ కేర్, హౌస్ కీపింగ్ డిస్పోజబుల్ ప్రొడక్ట్స్ అందుబాటులో ఉన్నాయని మార్కెట్లో రన్నింగ్ లో ఉన్న అన్ని ప్రొడక్ట్స్ కంటే తక్కువ ధరలకు ఎక్కువ ఆరోగ్యాన్ని, శుభ్రతను అందజేస్తుందని,డిమార్ట్ లాంటి కంపెనీలు పెద్దపెద్ద సిటీలలోనే అవైలబుల్ గా ఉన్నాయని,నవభారతి కంపెనీ తెలంగాణ మొత్తం చిన్న చిన్న మండలాలలో సైతం అవైలబుల్ గా ప్రజలకు అందుబాటులో ఉంటుందని అన్నారు.మిగతా కంపెనీల ఉత్పత్తుల కంటే నవ భారతి ప్రొడక్ట్స్ వన్ ప్లస్ వన్ ఆఫర్ పైన సగం ధరకే వస్తాయని పర్యావరణానికి కానీ,ఆరోగ్యానికి హాని కలగకుండా ఈ ప్రొడక్ట్స్ ఉన్నాయని అన్నారు.ప్రభుత్వం మేకిన్ ఇండియా విధానాన్ని ఫాలో అవ్వాలని వేరే దేశం వస్తువులని వాడకుండా మన దేశంలో తయారైనటువంటి వస్తువులను వాడి ఆరోగ్యంగా ఉండాలని అలాగే ఈ కంపెనీ నిరుద్యోగులకు కూడా అవకాశం కల్పిస్తుందని,సంస్థ తెలంగాణ అంతా సప్లై ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ,ఎంఎల్సీ జీవన్ రెడ్డి, దొడ్డే సుందరం,మహమ్మద్ నవీద్ భాష,పంకజ్ సింగ్ రాజ్ పుట్, నవ భారత్ సభ్యులు పాల్గొన్నారు.

## భావితరాలకు డ్రగ్స్ రహిత సమాజం అందించాలి

### పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం




కరీంనగర్, (వాయిస్ టుడే):కరీంనగర్ జిల్లా పోలీస్ మరియు సంక్షేమశాఖల ఆధ్వర్యంలోనషా ముక్త్ భారత్ అభియాన్ సెలబ్రేషన్స్ లో భాగంగా జరిగిన అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల యువత, విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరు పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్య క్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, పోలీసు అధికారులు,ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## పోలీస్ స్మారక వారోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం..



మెటుపల్లి.వాయిస్ టుడే న్యూస్ ప్రతినిధి.అక్టోబర్ 25: జగిత్యాల జిల్లా మెటుపల్లి పోలీస్ స్మారక వారోత్సవంలో భాగంగా ఈ రోజు మెటుపల్లి పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి రాములు,సి.ఐ అనిల్‌కుమార్, ఎస్.ఐ కిరణ్‌కుమార్,రాజు నాయక్,గంగాధర్,ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్,పాల్గొన్నారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి ఎ రాములు మాట్లాడుతూ.... రక్తదానం ఒక గొప్ప సేవ ప్రతి వ్యక్తి సమాజానికి చేయగల అత్యంత విలువైన దానం ఇదే పోలీస్ సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజల సేవలో ముందుండి ఉండాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, డాక్టర్లు,స్వచ్ఛంద సేవకులు,ప్రజా ప్రతినిధులు, యువకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు.




## నిర్దిష్ట లక్ష్యాలను సాధిస్తూ పోవడమే జీవన సాఫల్యత

### లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

కరీంనగర్, (వాయిస్ టుడే): స్వల్పకాలిక,మధ్యస్థ, దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్ణయించుకొని విజయాలు సాధిస్తూ ముందుకు సాగడమే అసలైన జీవన సాఫల్యత అని ప్రముఖ రచయిత,విశ్రాంత ప్రిన్సిపాల్ లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి అభిప్రాయపడ్డారు.కొత్తపల్లి సెయింట్ జార్జి హైస్కూలు ఆవరణలో లీడ్ ఇండియా,శాతవాహన లయన్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన జాతీయ రసాయనశాస్త్ర వారోత్యవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ రసాయనశాస్త్రం ఒక మిస్టరీ కాదని, రసాయన చర్యలతో ఆటలు ఆడుకోవాలని,అణు నమూనాలతో లోతైన అవగాహనను పెంపొందించుకోవాలని సూచించారు. మన చుట్టు జరుగుతున్న పలు రసాయన ప్రక్రియలను శాస్త్రీయంగా అధ్యయనం చేసి వైజ్ఞానిక శాస్త్ర అంచులను చేరాలని చెప్పారు.నిత్య జీవితంలో రసాయనశాస్త్ర దృగ్విషయాలను శోధించి ఆకలింపు చేసుకోవాలని అన్నారు.సరళ అణువుల నిర్మాణాలను త్రిమితీయ నమూనాగా అర్థం చేసుకోవాలని అన్నారు.పరమాణువుల లోతులను, అణువుల అమరికను ఆకలింపు చేసుకోవాలన్నారు.పలు అణువుల నమూనాలతో శాస్త్ర విజ్ఞానాన్ని బోధించారు.సభాధ్యక్షత వహించిన స్కూల్ చైర్మన్ ఫాతిమా రెడ్డి మాట్లాడుతూ ఉన్నత విద్య వరకు అత్యంత క్రమశిక్షణతో చదివి రేపటి సమాజానికి దారి దీపంగా నిలవాలని అన్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన రసాయనశాస్త్ర పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

## స్వంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజలో పాల్గొన్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్,అక్టోబర్ 24(వాయిస్ టుడే): పది సంవత్సరాలు బిఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలు మోసపోయారని డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని ఊదరగొట్టి ఒక్క ఇల్లు కూడా కట్టించలేదని ఆనాడైన ఈనాడైన ఇండ్లు నిర్మించి ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. హుస్సేనీ పురాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి లబ్ధి దారులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజన్ భాద్యులు షబానా మహమ్మద్, సమద్ నవాబ్, హనీఫ్,మీరజ్,మసుమ్,ఖలీల్,బషీర్,జాఫర్,ముల్కలా కవిత,అస్తపురం తిరుమల,ఊరడి లత పాల్గొన్నారు.





## పూర్వ విద్యార్థుల ఆహ్వానం స్వీకరించిన ఎమ్మెల్యే

సుల్తానాబాద్, పెద్దపల్లి జిల్లా అక్టోబర్ 25 వాయిస్ టుడే: సుల్తానాబాద్ మండలం నరసయ్య పల్లి లో ఆదివారం విజయ గార్డెన్ లో జరుగు పూర్వ విద్యార్థులు పంతొమ్మిది వందల డెబ్బై ఐదు పంతొమ్మిది వందల డెబ్బై ఆరు, పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి హాజరు కావాలని, సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలోని స్టేజీపై బ్యాచ్ జ్ఞాపకార్థంగా లక్ష రూపాయలతో నిర్మించిన రేకులషేడ్ ను మీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ను పూర్వ విద్యార్థులు కందుకూరి ప్రకాష్ రావు పెద్దన్న, డాక్టర్ దూడం మధుకర్, కమలాకర్ రెడ్డి, ఖాసిం తో పాటు పలువురు సాదరంగా ఆహ్వానించడం జరిగింది..




## విధి కుక్కల దాడులపై పిర్యాదు

రాయికల్ ( వాయిస్ టుడే): రాయికల్ పట్టణంలోని కుక్కలా దాడులపై చర్యల కోరుతు వివిధ ప్రజా సంఘల నాయకులు పురపాలక సంఘం అధికారులు ,మరియు రాయికల్ పశు సంవర్ధక శాఖ అధికారులకు పిర్యాదు చెయ్యడం జరిగింది ,విధి కుక్కల పునరుత్పత్తి నివారణకు విజ్ఞప్తి జంతు జనన నియంత్రణ చట్టం 2001 ను అనుసరించి విధి కుక్కల నివారణ కు చర్యలు చేపట్టాలని విధి కుక్కల సంఖ్య రోజు రోజుకి పెరిగిపోవడంతో పాటు ప్రజల పై కుక్కలు దాడులు చేస్తున్నాయి. అనేక సార్లు వీటి దాడులలో చిన్నారులు సైతం బలవుతున్నారు. తరుచుగా పలు కాలనిలో వీధికుక్కలు దాడుల ద్వార రోజు రోజు కు బాధితులు పెరుగుతున్నారు. ఇట్టి సమస్య పై అనేక సార్లు అధికారులకు విన్నపించిన స్పందన లేక పోవడం దారుణం. జంతువు వాధ నిషేధం అన్నప్పుడు వాటి ద్వార ఇబ్బందులు ఎదుర్కొకుంటూ ఆసుపత్రి పాలవుతున్నా. మనుషుల మానవ హక్కుల రక్షణ కు ఇవి ఆటకంగా మారాయి. దీనిపై వెంటానే స్పందించి వీధికుక్కలు నివారణ కు పునరుత్పత్తి కాకుండ నివారించవలని అన్నారు ఈ కార్యక్రమంలో కుర్మ మల్లారెడ్డి, సామల సతీష్, బొద్దుల శివ కుమార్, గొనె మహేష్ ,మాచర్ల మారుతి,చందా రమేష్ ,సింగని వరుణ్ చింతకుంట సాయికుమార్ ,వీరబత్తిని శ్రీధర్ ,మహేష్ తదితరులు పాల్గొన్నారు



## బట్టల పంపిణీ అన్నదానం

రాయికల్( వాయిస్ టుడే) : రాయికల్ పట్టణానికి చెందిన రుద్రవేని మహేష్ ఆయన జన్మదిన వేడుకలు పురస్కరించుకొని కొండగట్టు ఆలయ ప్రగణంలో ఉన్న బిక్షాటకులకు అన్నదానం చేశారు అనంతరం బట్టలు పంపిణీ చేశారు జన్మదిన వేడుకలకు పేరా డబ్బులు వృధా చేయకుండా ఇలా విధిన పడ్డ అభాగ్యులకు సహాయం అందించడం అభినందనీయం అని పలువురు మహేష్ అభినందించారు.



## ఊరు మధ్యలో నీటి నీల్వ

### లార్వాతో విషా జర్వల వ్యాప్తి

రాయికల్( వాయిస్ టుడే)బీ రాయికల్ పట్టణంలోని రెండవ వార్డులో ఇండ్ల మధ్యలో ఆగిన నీటి నిల్వ ఉండి, డెంగ్యూ మలేరియా టైపాడ్ వైరస్ ల వ్యాప్తి పెరిగి ప్రజలు విష జర్వల పాలవుతున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టగా పట్టణంలోని విధుల్లో నిల్వ నీటిని తొలగించ వలసిన పురపాలక సంఘం అధికారులు నిర్లక్ష్యం వహించండంతో ప్రజలు విష జర్వలు పాలవుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# వంగర ఘటనపై సమగ్ర దర్యాప్తుకు ఆదేశించాం:ప్రణవ్

**బాలిక మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన ప్రణవ్.**

**బాలిక మృతదేహాన్ని అడ్డుపెట్టుకొని శవ రాజకీయాలు చేయడం సిగ్గుచేటు..**

**ఓటు చోరీపై ఎలక్షన్ కమిషన్ కౌశిక్ రెడ్డి చంప చెళ్లుమనిపించింది.**

**కౌశిక్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో మండిపడిన ప్రణవ్**



హుజురాబాద్ అక్టోబర్ 25 (వాయిస్ టుడే): శుక్రవారం నాడు భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో హుజురాబాద్ మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన శ్రీ వర్షిత అనే బాలిక ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమని,దీనిపై ఇప్పటికే రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విచారణకు ఆదేశించారని,నివేదిక రాగానే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలియజేశారు. బాలిక మృతదేహాన్ని అడ్డుపెట్టుకొని కౌశిక్ రెడ్డి చేసిన ధర్నా చూస్తే సభ్య సమాజం తలదించుకునేలా ఉందని,పాప చనిపోయి పుట్టెడు దుఃఖంలో తల్లిదండ్రులు ఉంటే దీన్ని కౌశిక్ రెడ్డి అదునుగాతీసుకొని పోస్ట్ మార్టం అయిన తర్వాత బాలిక మృతదేహాన్ని అంబేద్కర్ చౌరస్తాలో పెట్టి ధర్నా చేయడం నీచమైన రాజకీయమని,అప్పుడు ఓట్ల కోసం సెంటిమెంట్ వాడుకున్నాడని,ఇప్పుడు శవరాజకీయాలను కౌశిక్ రెడ్డి ప్రోత్సహిస్తున్నాడని ఇది సిగ్గు చేటని అన్నారు. కౌశిక్ రెడ్డి లాంటి దౌర్భాగ్యపు ఎమ్మెల్యే ను దేశంలో ఇంతవరకు చూడలేదని అన్నారు. కౌశిక్ రెడ్డికి అంతలా సహాయం చేయాలి అనుకుంటే నేరుగా అధికారులతో మాట్లాడి సహాయం చేయాలి కానీ ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయడం మంచిదికాదని అన్నారు.

**ఓటు చోరీపై అసత్యపు ప్రచారాలు మానుకో కౌశిక్ రెడ్డి : ప్రణవ్**

ఓటు చోరీ జరిగిందని ఆరోపించిన కౌశిక్ రెడ్డికి ఎన్నికల సంఘం గట్టిగా బుద్ధి చెప్పిందని,చెంప చెల్లుమనేలా సమాధానం ఇచ్చిందని ఇప్పటికైనా కౌశిక్ రెడ్డి బుద్ధి మార్చుకోవాలని కోరారు.ఎన్నికల సంఘం గతంలో బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఇదే ఓట్లు ఆ అపార్ట్మెంట్ లో ఉన్నాయని సమాధానం ఇవ్వగా బిఆర్ఎస్ నాయకులు తెల్లమొహం వేశారని అన్నారు.



## జాగృతిలో మనకోండూర్ బిసి నాయకుల చేరిక

కరీంనగర్,అక్టోబర్ 25(వాయిస్ టుడే): బిసి రిజర్వేషన్ విషయంలో జాతీయ పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని జాగృతి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ విమర్శించారు.కరీంనగర్ జాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు మనకోండూర్ మండల బిసి నాయకులు వంగల లింగచారి ఆద్వర్యంలో విడపు ఉగేందర్,బానాల కుమారస్వామి,వెల్ది రాజశేఖర్,వంగల కుమారస్వామి,జాగృతిలో చేరారు. వారికి జిల్లా జాగృతి అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ వారికి జాగృతి కండువాలు కప్పి జాగృతిలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా బిసిలను ఐక్యం చేయడంలో కవిత కీలకంగా పనిచేస్తున్నారని,రెండు జాతీయ పార్టీలు బిసిలకు మోసం చేసినవే నలబై రెండు శాతం రిజర్వేషన్ అమలు చేయడం ఈ ప్రభుత్వానికి ఇష్టం లేదు బిసిలకు ఈ ప్రభుత్వం చేసిన మోసాన్ని ప్రజలు గ్రహించారు అన్నారు.ఈ ప్రభుత్వం బిల్లు తెచ్చింది, ఆర్డినెన్స్ ఇచ్చింది,జీవో చేసింది కాంగ్రెస్ పార్టీ నాయకులతో కోర్ట్ లో కేసులు కూడ వేయించిన విధానం ప్రజలు గమనిస్తున్నారు అన్నారు. ప్రభుత్వ విధానాన్ని కాంగ్రెస్ మోసన్ని తెలంగాణ జాగృతి ఊరూరా తిరిగి ప్రచారం చేస్తుందని వారు అన్నారు. బిజెపి కూడ చేసే అవకాశం వాళ్ళ చేతిలో ఉన్నప్పటికీ వాళ్ళు కూడ బిసిలను గాలికి వదిలేశారని జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల తిరుపతి, జిల్లా నాయకులు గాలిపల్లి రత్నాకర్, అపర్ణ మంజు భార్గవి, గర్షకుర్తి విద్యాసాగర్ పాల్గొన్నారు.



## జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**- టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపురావు**

**- ఫెడరేషన్ సభ్యులకు గుర్తింపు కార్డుల పంపిణీ**

జమ్మికుంట అక్టోబర్ 25 (వాయిస్ టుడే): జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం మరింత జాప్యం చేయడం తగదని, దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపురావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా.. జర్నలిస్టుల సమస్యలను ఇంత వరకు పరిష్కరించలేదన్నారు. శనివారం జమ్మికుంట పట్టణంలోని టిడబ్ల్యూజేఎఫ్ కార్యాలయంలో నియోజకవర్గ కమిటీ అధ్యక్షులు సౌడమల్ల యోహాన్ ఆధ్వర్యంలో ఫెడరేషన్ సభ్యులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హాజరైన జిల్లా కార్యదర్శి కుతాడి బాపురావు మాట్లాడుతూ... మెజారిటీ జర్నలిస్టుల జీవన పరిస్థితులు దయనీయంగా మారుతున్నాయని, ముఖ్యంగా గ్రామీణ విలేకరుల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పదేళ్లు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా ద్రోహం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నదన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత జర్నలిస్టులకు ఒరిగిందేమి లేదన్నారు. కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా కొత్త అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు సౌడమల్ల యోహాన్, ఏ బూ సి సంపత్, టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు భూపతి సంతోష్, అరికిల్ల భానుచందర్,దొద్దే రాజేంద్రప్రసాద్, కందుకూరి రాజు, నరేష్, రచ్చ రవికృష్ణ, కొక్కుల శ్రీరామ్, నాగపురి రాజు, గుండ రాజేంద్రప్రసాద్, తాళ్లపల్లి నవీన్, కె .వంశి, పెద్ది సంతోష్, జీడి రాజు, దొద్దే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## కరీంనగర్ జిల్లా నుంచి టీఆర్పీ పార్టీలో చేరికలు

**రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వివిధ పార్టీల నాయకులు**

కరీంనగర్,అక్టోబర్ 25(వాయిస్ టుడే):కరీంనగర్ జిల్లా నుండి వివిధ పార్టీల నాయకులను హైదరాబాద్ టీఆర్పీ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా ఆధ్వర్యంలో చేరారు.పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నూతన సభ్యులకు కండువాలు కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు. అనంతరం నూతన సభ్యులతో మల్లన్న మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీసీ రాజ్యాధికారం సాదించుకోవడం టీఆర్పీ పార్టీ తోనే సాధ్యమైతుందని తెలిపారు. టీఆర్పీ పార్టీ కరీంనగర్ జిల్లాలో గ్రామ వ్యాప్తంగా బలపడేటట్టు అందరూ కలిసి కృషి చేయాలని సూచన చేశారు. మనమెంతో మనకంత అనే నినాదంతో ప్రజా క్షేత్రంలోకి వెళ్లి అగ్రవర్ణాల దోపిడీని అరికట్టాలని అందుకు గాను మీరంతా పార్టీ సైనికులై కష్టపడాలి తెలిపారు.పార్టీలో చేరిన నూతన సభ్యులు ఆర్షన్ బిల్ అలీ (చోటు),మొహమ్మద్ వాజిద్, జడగల శ్రీనివాస్,మాటూరి శ్రీనివాస్, షేక్ చంద్ పాషా,మహబూబ్ అలీ పాల్గొన్నారు.



## అలుపెరుగని పోరాటం తరువాత మోకపై గిరిధావర్ విచారణ

**- దీనిని బట్టి చూస్తే ఈ సమస్య తుదకు చేరినట్టేలా ఉంది..!**

**- తనుగుల గ్రామ దళిత కాలనీ వాసులు వెల్లడి**

**- తొందరగా కాలనీ పేరు మీద పట్టా చేయాలాని విజ్ఞప్తి**

జమ్మికుంట అక్టోబర్ 25 (వాయిస్ టుడే): ధరణి రాకతో దళితుల భూమి అక్రమానికి గురై దాంతో అలుపెరుగక గత రెండు సంవత్సరాల నుండి పోరాడుతున్నా.. పోరాటం దాదాపు తుదకు చేరినట్టేనని,కరీంనగర్ జిల్లా, జమ్మికుంట మండలం,తనుగుల గ్రామానికి చెందిన దళిత కాలనీ వాసులు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఈ సందర్భంగా అంబాల రజనీకాంత్ మీడియాతో మాట్లాడుతూ.... ధరణి రాకతో సర్వేనెంబర్ 169/%ఖ% లో ఉన్న 2.31 గుంటల తమ ఇడ్ల స్థలాల భూమిని అప్పటికి బి ఆర్ ఎస్ నాయకుల ప్రోత్బలంతో తమ గ్రామానికి చెందిన నిమ్మకాయల నర్సయ్య కు అక్రమంగా పట్టా చేయించారన్నారు. దీనిని తాము గమనించి,ఈ సమస్య పరిష్కారానికై అప్పటి నుండి ఇప్పటికి వరకు అలుపెరుగక పోరాడుతూనే ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అంతలోనే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారం లోకి వచ్చి, భూ భారతి పోర్టల్ ను ప్రవేశ ప్రవేశపెట్టారన్నారు. అందులోనే సాదాబై నామాల పరిష్కారం కూడా భూభారతిలో పరిష్కారం చేస్తామని చెప్పడంతో తమకెంతో ఉత్సాహం వచ్చిందన్నారు. దాంతో తాము తమ భూ సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తే, నేడు జమ్మికుంట మండల ఎమ్మార్వో వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నేడు మోకపై,గిరిధావర్ (RI) వచ్చి విచారణ చేశారన్నారు. కాగా దినిని బట్టి చూస్తే దాదాపు ఈ సమస్య తుదకు చేరినట్టేనని అన్నారు.ఇంకా తొందరగా,తమ కాలనీ పేరు మీద ఆ ఆ ఇండ్ల స్థలాల భూమిని పట్టా చేయాలాని ప్రభుత్వాన్ని వేడుకున్నారు.

## రిటైర్మెంట్ ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు వెంటనే చెల్లించాలి

**- తహశీల్దార్‌కి వినతిపత్రం అందజేత**



హుజురాబాద్ అక్టోబర్ 25 (వాయిస్ టుడే): రిటైర్మెంట్ అయిన ఉద్యోగులకు రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే అందజేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం తహశీల్దార్ కనుకయ్యకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను చెల్లించాలని డిమాండ్ చేశారు. చాలామంది ఉద్యోగులు పదవీ విరమణ పొంది చాలా కాలం అవుతున్నా వారికి రావాల్సిన గ్రాట్యుటీ, జనరల్ ప్రావిడెంట్ ఫండ్, గ్రూప్ ఇన్సూరెన్స్, కమ్యుటేషన్, సరెండర్ లీవులు వంటి ఆర్థిక ప్రయోజనాలు ఇంకా అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పదవీ విరమణ తర్వాత ఈ ప్రయోజనాలపైనే వృద్ధాప్య జీవితం ఆధారపడి ఉంటుందని, ఆర్థిక ప్రయోజనాలు అందకపోవడం వల్ల అనారోగ్య సమస్యలకు చికిత్స చేయించుకోలేక, పిల్లల పెళ్లిళ్లు, ఇతర ముఖ్యమైన ఖర్చులకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు ఒక్కోఉద్యోగికి లక్షల్లో ఉన్నాయని, ఈ నిధులు అందక అనేకమంది విశ్రాంత ఉద్యోగులు అప్పుల పాలవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల పేరు చెప్పకుండా విశ్రాంత ఉద్యోగుల కష్టాలను గుర్తించి యుద్ధప్రాతిపదికన రిటైర్మెంట్ బెనిఫిట్స్ మొత్తం విడుదల చేయాలని తహశీల్దార్ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.తక్షణమే పెండింగ్ బకాయిలను విడుదల చేసి విశ్రాంత ఉద్యోగులకు ఊరట కల్పించాలని తహశీల్దార్‌కు సమర్పించిన వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో రిటైర్మెంట్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ం



## ఎంపి నిధులతో వేసిన బోరుబావి ప్రారంభం

శంకరపట్నం,అక్టోబర్ 25(వాయిస్ టుడే): మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇటీవల కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ చొరవతో ఎంపీ నిధుల నుండి వేసిన బోరుబావిని మండల వైద్యాధికారి డాక్టర్ శ్రవణ్ కుమార్ ప్రారంభించారు. అనంతరం బిజెపి మండల అధ్యక్షులు ఎనుగుల అనిల్ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేసి హస్పటల్ కు వస్తున్న రోగుల అవసరం నిమిత్తం కోరగానే బోర్ వేయించిన బండి సంజయ్ కుమార్ కు మండల ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి,నాయకులు జంగ జైపాల్,దాసరపు నరేందర్, కొయ్యడ అశోక్,రాసమల శ్రీనివాస్, బిజిలి సారయ్య, కనకం సాగర్,పడాల వెంకటలక్ష్మి,బొజ్జ సాయి ప్రకాష్, గూళ్ల రాజు, తోట అనిల్,పంజాల అనిల్, గొల్లిపెల్లి వెంకటేశం,నర్సయ్య, తాడవేణి రవి, సంపత్ లతో పాటు సుపర్వేజర్ అనిల్, ఏ.ఎన్.ఎం. శ్రీవాణి పాల్గొన్నారు.



## కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర

**- ఫ్యాక్స్ చైర్మన్ బిల్లా వెంకట్ రెడ్డి**

సైదాపూర్ (వాయిస్ టడే): కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని, ధాన్యం విక్రయాల్లో రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను పొందాలని వెన్నంపల్లి సహకార సంఘం అధ్యక్షులు బిల్లా వెంకట్రెడ్డి అన్నారు. సంఘం పరిధిలోని వెన్నంపల్లి, ఎగ్లాస్పూర్, లస్మన్నపల్లి గ్రామాల్లో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గుండేటి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బైరి రాజు, సింగిల్ విండో డైరెక్టర్లు సారబుడ్ల రాజిరెడ్డి, మొలుగూరి సంపత్, గడ్డం అబ్బయ్య, కౌడగాని మోహన్ రావు, రాజేశ్వర్ రెడ్డి, తాడవేణి కనకయ్య, నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్, సీఈవో మల్లారెడ్డి, అసిస్టెంట్ సీఈవో భాస్కర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవ సందర్భంగా సైకిల్ ర్యాలీ

**పుర వీధుల్లో సైకిల్ ర్యాలీలో పాల్గొన్న సీపీ మరియు పోలీసు అధికారులు**



కరీంనగర్,అక్టోబర్ 25(వాయిస్ టుడే): పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవాలను పురస్కరించుకుని కరీంనగర్ పట్టణంలో 20 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీని నిర్వహించారు.పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుండి ర్యాలీని కమిషనర్ గౌష్ ఆలం జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు అందరికీ స్ఫూర్తి కావాలన్నారు.ఈ ర్యాలీలో కరీంనగర్ రన్నర్స్, సైక్లిస్ట్ అసోసియేషన్ సభ్యులు,విద్యార్థులు, డాక్టర్లు,పౌరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.కార్యక్రమం అనంతరం సీపీ గౌష్ ఆలం ర్యాలీలో పాల్గొన్న వారికి అమరవీరుల దినోత్సవ ప్రాముఖ్యతను వివరించి, మెడల్స్ అందజేశారు.అమరవీరుల వారోత్సవాలను అక్టోబర్ 31 వరకు వివిధ కార్యక్రమాలతో నిర్వహిస్తామని, ముఖ్యంగా విద్యార్థులు ఈ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనాలని పోలీస్ కమిషనర్ కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు వెంకటరమణ, భీంరావు, ఏసీపీలు వెంకటస్వామి, విజయకుమార్,యాదగిరి స్వామి, మాధవి, ఇన్స్పెక్టర్లు, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి, కమిషనరేట్ రన్నర్స్, సైక్లిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్ పాసుల, డాక్టర్ అజయ్ ఖండాల, డాక్టర్ కిరణ్ పాల్గొన్నారు.